క్లుప్తంగా

శ్రీనివాసునికి పంచామృత అభిషేకాలు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ):శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని చిట్టినగర్‌లో వేంచేసిన పద్మావతి, గోదాదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున స్వామి వారికి సుప్రభాత సేవ, పంచామృత అభిషేకాలు, విశేష అలంకరణ, అర్చన చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు రామరత్నమాచార్యులు, ఇతర అర్చక స్వాములు అభిషేకం జరిపించారు. స్వామి వారి అభిషేకాన్ని వీక్షించేందుకు విచ్చేసిన భక్తజనం గోవింద నామాలను ఏకకంఠంతో పలకగా, ఆలయం మార్మోగింది. స్వామి వారికి విశేష అలంకరణ అనంతరం భక్తులను స్వామి వారి దర్శనానికి అనుమతించారు. స్వామి వారికి తులసీదళాలతో అర్చన నిర్వహించగా, పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

ఆటోలో మరచిపోయిన బ్యాగ్ అప్పగింత



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రయాణికురాలు ఆటోలో మరచిపోయిన దుస్తుల బ్యాగ్‌ను అప్పగించిన ఘటన గవర్నర్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన సమాచారం... సయ్యద్ ఇర్షద్ బందర్ రోడ్ లోని శుభమస్తు షాపింగ్ మాల్‌లో పని పూర్తి చేసుకుని ఆటో ఎక్కింది. చల్లపల్లి బంగ్లా వద్ద ఆటో దిగి వెళ్లిపోయింది. ఆటోలో షాపింగ్ చేసిన బట్టల బ్యాగ్ మరిచిపోయి వెళ్లిపోయింది. తర్వాత బ్యాగ్ మరచిపోయిన విషయాన్ని గుర్తించి భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. తక్షణమే స్పందించిన సీఐ వెంకటరమణ, ఎస్సై నారాయణమ్మ ఆటోను గుర్తించారు. ఆటోలో ఉన్న బ్యాగ్‌ను గుర్తించి మహిళకు అందజేశారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో నలుగురు ఎంపిక



మధురానగర్(విజయవాడసెంట్రల్):మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జి సెంటర్ ఆధ్వర్యాన డిగ్రీ చివరి సంవత్సరం విద్యార్థులకు మహీంద్రా ఆటోమోటివ్, పీపుల్స్ మ్యాక్ సొసైటీ కంపెనీలు నిర్వహించిన ఇంటర్వ్యూల్లో నలుగురు విద్యార్థులకు నియామక పత్రాలు అందజేశారు. మొత్తం 40 మంది హాజరు కాగా పది మంది తదుపరి రౌండ్‌కు అర్హత సాధించారు. ఎంపికయిన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి చేతుల మీదుగా నియామక పత్రాలు అదజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాము ఉపాధి ఆధారిత కోర్సులకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. జవహర్ నాలెడ్జి సెంటర్ ద్వారా స్కిల్స్‌ను అప్‌డేట్ చేయటతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్పిస్తున్నట్లు తెలిపారు. జవహర్ నాలెడ్జిసెంటర్ కో ఆర్డినేటర్ జి. విజయదీప్, సీహెచ్ అప్పారావు, జి.దివ్య, డి.సురేష్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

సామాజిక బాధ్యతగా పర్యావరణ పరిరక్షణ



గన్నవరం: పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరూ బాధ్యతగా గుర్తించాలని ఏపీ ఎన్జీసీ జిల్లా కోఆర్డినేటర్ కొమరగిరి అన్నపూర్ణ పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా అన్నపూర్ణ మాట్లాడుతూ నానాటికి పెరుగుతున్న వాతావరణ కాలుష్యం కారణంగా సమస్త ప్రాణకోటి మనుగడ ప్రమాదకరంగా మారిందన్నారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించడంతో పాటు విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. పాఠశాల హెచ్ఎం నిమ్మగడ్డ రవీంద్రభవాని, ఉపాధ్యాయులు ఝాన్సీ, సునీత, నాగరాజు, షేక్ మీరాసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు అడిగే హక్కు జగనన్నకే ఉంది

- పింఛన్ అందకుండా అడ్డుపడిన కూటమికి ఎందుకు ఓటేయాలి
- పశ్చిమంలో మతోన్మాద శక్తులకు చోటు లేదు
- వైఎస్సార్ సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆసిఫ్



ప్రచారంలో ఇంటింటికీ తిరుగుతున్న ఆసిఫ్, గోదావరి గంగ తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ):వలంటీర్ల ద్వారా అవ్వాతాతలు, దివ్యాంగులు, రోగుల ఇళ్లకు వెళ్లి పింఛన్ అందకుండా అడ్డుపడుతున్న చంద్రబాబు కూటమికి ఎందుకు ఓటు వేయాలో ప్రజలు ఆలోచన చేయాలని వైఎస్సార్ సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ తెలిపారు. పేదలకు మంచి జరిగితే సహించలేని టీడీపీ కూటమికి ఎందుకు ఓటు వేయాలో ప్రతిపక్షాలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఓటు అడిగే హక్కు సీఎం జగన్ నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మాత్రమే ఉందని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన 47వ డివిజన్ కార్పొరేటర్ గోదావరి గంగ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. కొండ ప్రాంతంలో ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడక్కడ నీటి కొరత ఉందని స్థానికులు చెప్పిన వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడారు. తక్షణమే సమస్య పరిష్కరించాలని కోరారు. ఇప్పటికే కొండ ప్రాంతంలో మెట్లు, డ్రెయిన్లు కొత్తవి నిర్మించటమే కాకుండా పాడైపోయిన చోట మరమ్మతులు చేయించారని చెప్పారు. స్థానిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం కాబట్టే గడప గడపకు వెళ్లి ఓట్లు అడగగలుగుతున్నామని చెప్పారు. గత ప్రభుత్వ ప్రతినిధులు ఏ ఒక్క సమస్య పరిష్కరించకుండా, ఏ ఒక్క హామీ నెరవేర్చకుండా ఓట్లు ఎలా అడుగుతారని ప్రశ్నించారు.

పశ్చిమంలో మతోన్మాదులకు చోటు లేదు

విభిన్న కులాలు, మతాలు ఉన్న పశ్చిమ నియోజకవర్గంలోని ప్రజలు కులమతాలకు అతీతంగా కలిసిమెలిసి అన్నదమ్ముల్లా ఉంటుంటే ఇప్పుడు మతోన్మాద శక్తులు ప్రవేశించాయని, వారికి ఇక్కడ చోటు లేదని చెప్పారు. బీజేపీ వంటి మతోన్మాద పార్టీకి, దానికి వంత పాడుతున్న టీడీపీ, జనసేన పార్టీలకు ఇక్కడ స్థానం లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల ప్రజలపై పెత్తనం సాగించేందుకు బ్యాంకులను మోసగించిన సుజనా చౌదరి ప్రజలను కూడా మోసగించాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. బ్యాంకుల్లా మోసపోవడానికి ప్రజలు సిద్ధంగా లేరని తెలిపారు. చైతన్యవంతమైన పశ్చిమ నియోజకవర్గంలో డబ్బు సంచులతో ప్రజల మనసులను గెలవలేరనే విషయాన్ని సుజనా చౌదరి తెలుసుకోవాలని హితవు పలికారు. రానున్న ఎన్నికల్లో పెత్తందారులకు పేదలకు మధ్య జరుగనున్న యుద్ధానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు మేమంతా సిద్ధం అని నినదిస్తున్నారని పేర్కొన్నారు. సీఎం జగన్ వెంటే ప్రజలంతా ఉన్నారని చెప్పారు. 175కు 175 సీట్లు సాధించడమే తమ లక్ష్యమని వెల్లడించారు. కార్పొరేటర్ యలకల చలపతిరావు, వడ్డెర, నగరాల కార్పొరేషన్ల డైరెక్టర్లు దేరంగుల రమణ, మజ్జి శ్రీనివాసరావు, 47వ డివిజన్ అధ్యక్షుడు కూరాకుల నాగ, 52వ డివిజన్ ఇన్‌చార్జ్ తంగెళ్ల రామచంద్రరావు, ఎస్సీ సెల్ నాయకులు కామశ్ల జోజి, రెడపంగు క్రాంతి, పీ శరత్, బూదాల శ్రీను, కామశ్ల కిషోర్, పార్టీ నాయకులు అత్తలూరి పెదబాబు, దిద్దుకూరి శివ, నన్నం దుర్గ, ఇ.విజయలక్ష్మి, ఏనుగుల సునీల్, జీఎంసీ అల్తాఫ్, ముత్యాల రాంబాబు, కరీం తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన



మాట్లాడుతున్న డీసీపీ హరికృష్ణ, సీఐ సత్యనారాయణ

దాములూరు(ఇబ్రహీంపట్నం): రానున్న ఎన్నికల్లో స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలని వెస్ట్ జోన్ డీసీపీ టి.హరికృష్ణ అన్నారు. దాములూరు గ్రామలో గురువారం ఓటు హక్కుపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మీప్రాంతంలో ఉన్న రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లను బైండవర్ చేశామని చెప్పారు. ఎన్నికల నియమావళి నేపథ్యంలో ఏ కార్యక్రమానికైనా ముందస్తు అనుమతి తప్పనిసరి అని అన్నారు. ఎవరైనా ప్రలోభాలకు గురిచేసినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. సీ విజిల్ యాప్ వినియోగం, ఉపయోగాలపై అవగాహన కల్పించారు. సీఐ ఎం.సత్యనారాయణ, ఎస్ఐలు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీపై క్షుద్ర రాజకీయాలు చేయవద్దు



మీడియాతో మాట్లాడుతున్న శ్రీనివాస్ కుమార్

భవానీపురం(విజయవాడపశ్చిమ):అవ్వాతాతలు, దివ్యాంగులు, కిడ్నీ, థలసేమియా పేషెంట్లకు అందించే సామాజిక పింఛన్ల పంపిణీపై క్షుద్ర రాజకీయాలు చేయవద్దని చంద్రబాబు, జనసేన, బీజేపీ కూటమిని వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్ హెచ్చరించారు. గురువారం ఆయన విద్యాధరపురంలో మీడియాతో మాట్లాడుతూ కూటమికి పేదలపై కక్ష ఉందన్న సంగతి అందరికి తెలిసిందేనన్నారు. అయితే అది ఇప్పుడు పరాకాష్టకు చేరుకుందని తెలిపారు. టీడీపీ ఏజెంట్ నిమ్మగడ్డ రమేష్ చౌదరి ద్వారా కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించి వలంటీర్లతో సజావుగా సాగుతున్న పింఛన్ల పంపిణీని అడ్డుకోవడం దుర్మార్గమని పేర్కొన్నారు. పింఛన్‌దారులు సచివాలయాలకు వెళ్లలేక పడుతున్న కష్టాలు మీకు కనబడటం లేదా అని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విజయం ఖాయమని తెలిసి ఆ కక్ష వలంటీర్లపై చూపించారని మండిపడ్డారు. సీఎం జగనన్న ఒక్కడిని ఓడించేందుకు మూడు పార్టీల జెండాలు జత కట్టాయంటే ఆయనకు ఉన్న ప్రజాబలం ప్రజలకు అర్థమై పోతుందన్నారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున జనబలం ఉన్న నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి వంటి వ్యక్తి దేశంలో మరెక్కడా లేడని పేర్కొన్నారు. మండుటెండల్లో పండుటాకులు పడుతున్న అవస్థలు చూస్తుంటే ఎవరికైనా మనసు చలించిపోతుందన్నారు. కానీ స్వార్థ రాజకీయ ప్రయోజనాలు తప్ప కూటమి నాయకులకు మానవత్వం అనేది లేదని పింఛన్ల పంపిణీ ఆపు చేసినప్పుడే రుజువు అయిందన్నారు.

9న ఆల్ ఎంప్లాయీస్ పెన్షనర్స్ అసోసియేషన్ ఉగాది వేడుకలు



ఉగాది వేడుకల ఆహ్వాన పత్రికను విడుదల చేస్తున్న అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు

భవానీపురం(విజయవాడపశ్చిమ):శ్రీ క్రోధి నామ సంవత్సరాన్ని పురస్కరించుకుని ఈ నెల 9వ తేదీన వేడుకలను నిర్వహించనున్నట్లు ఆల్ ఎంప్లాయీస్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సూరిశెట్టి వెంకటేశ్వరరావు, సందక కృష్ణ తెలిపారు. భవానీపురం హౌసింగ్‌బోర్డ్‌కాలనీలోని అసోసియేషన్ హాల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉగాది వేడుకల వివరాలను వెల్లడించారు. ఆ రోజు ఉదయం 9.30 గంటలకు విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు ఆవంచ వేణుగోపాల రాధాకృష్ణమూర్తి పంచాంగ పఠనం చేస్తారని చెప్పారు.

అనంతరం నిర్వహించే సభా కార్యక్రమంలో విశ్రాంత ఉన్నతాధికారులు సాలి ఆంజనేయులు (ఏపీ జెన్‌కో–డైరెక్టర్), అబ్బిలి ఆంజనేయులు (ఎంపీడీఓ – పంచాయతీరాజ్), తెలగరెడ్డి సత్యానంద్ (జాయింట్ కమిషనర్ ఆఫ్ ఇన్‌కంట్యాక్స్) అతిథులుగా పాల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో భాగంగా సూరిశెట్టి రామయ్య – మహాలక్ష్మి మెమోరియల్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యారమ్స్ పోటీలో విజేతలకు బహుమతి ప్రదానం జరుగుతుందని చెప్పారు.

అనంతరం విశ్రాంత సంస్కృత అధ్యాపకులు పమిడిపాటి పట్టాభి రామారావు కవితలు వినిపిస్తారని పేర్కొన్నారు. సమావేశంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షులు దేవరకొండ శేషగిరిరావు, కోశాధికారి యెనిగళ్ల సుబ్బారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాది వేడుకలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను విడుదల చేశారు.

సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎన్నుకోవాలి



కరపత్ర ఆవిష్కరణలో నారాయణరావు, వెంకటేశ్వరెడ్డి, ఆంజనేయరాజు, డాక్టర్ సాంబశివరావు

విజయవాడ కల్చరల్: పోలవరపు కోటేశ్వరరావు ఆలిండియా ఘంటసాల చైతన్యవేదిక, జనవిజ్ఞాన వేదిక, తెలుగు కళావాహిని, జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి, శ్రీ కళాభారతి ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ప్రెస్ క్లబ్‌లో గురువారం ఊరూరా జనవిజ్ఞానం, ప్రజాస్వామ్య పరిరక్షణ చర్చాపత్రం ఆవిష్కరణ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గోళ్ళ నారాయణరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ విజయవంతం కావాలంటే ప్రజలు సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎన్నుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జనవిజ్ఞాన వేదిక బాధ్యుడు కోట వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాలపట్ల ప్రజలు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మూఢనమ్మకాలు ప్రగతి నిరోధకాలుగా అభివర్ణించారు. విశ్రాంత తెలుగు అధ్యాపకుడు డాక్టర్ గుమ్మా సాంబశివరావు మాట్లాడుతూ నేటి తరం విద్యార్థులు సామాజిక శాస్త్రం, రాజనీతి శాస్త్రంపై అవగాహన పెంచుకోవడానికి విస్తృతంగా పర్యటించాలని సూచించారు. విశ్రాంత అధ్యాపకుడు డాక్టర్ వెన్నావల్లభరావు, సాంస్కృతిక, కళా సంస్థల ఐక్యవేదిక అధ్యక్షుడు బోడి ఆంజనేయరాజు, డీవీ రంగారెడ్డి ప్రసంగించారు. డేవిడ్‌రాజు, శ్యాంప్రసాద్, ప్రిన్స్, దుర్గా నాగమణి, ఝాన్సీ తదితరులు దేశ భక్తి గీతాలను ఆలపించారు.

కూలింగ్ ఫ్రీజర్ వితరణ



శానిటరీ అధికారులు, సిబ్బందికి కూలింగ్ ఫ్రీజర్ అందిస్తున్న నాగేశ్వరరావు, సభ్యులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఎండలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులు జాగ్రత్తగా ఉండాలని కళ్ళే లలితా చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కళ్ళే నాగేశ్వరరావు అన్నారు. 59వ డివిజన్ శానిటరీ కార్యాలయానికి ఆ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంచినీటి కూలింగ్ ఫ్రీజర్‌ను గురువారం అందించారు. వేసవి తాపం వల్ల ఎండకు రాకపోకలు సాగించే వారు నీటి ఎద్దడికి గురవుతుంటారని తెలిపారు. సాధ్యమైనంత వరకూ ప్రజలు ఎండ వేళల్లో బయటకు రాకుండా ఉండేలా చూసుకోవాలన్నారు. పలు విభాగాల్లో పనిచేసే కార్మికులు, రాకపోకలు సాగించే ప్రయాణికులు ఎప్పుడు మంచినీటిని అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. పారిశుద్ధ్య కార్మికుల దాహార్తిని తీర్చాలనే ఉద్దేశంతో తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో కూలింగ్ ఫ్రీజర్‌ను అందించినట్లు తెలిపారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ పి.రామకృష్ణ, ముప్పూరి హరీష్, సైకం సాయిబాబా, బలుసుపాటి మహేష్, చల్లగాలి అనిల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భార్యపై కోడికత్తితో దాడిచేసిన భర్త

గన్నవరం: కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యపై భర్త కత్తితో దాడి చేసిన సంఘటనపై గన్నవరం పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం ప్రకారం.. స్థానిక గొడపేటకు చెందిన మసిముక్క వెంకటేశ్వరరావుకు పదేళ్ల క్రితం వర్ధీకాసులతో వివాహం జరిగింది. ఇరువురి మధ్య గత కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం వీరి మధ్య మాటమాట పెరిగి వివాదానికి దారితీసింది. దీంతో ఆగ్రహానికి గురైన వెంకటేశ్వరరావు కోడికత్తితో భార్యపై దాడి చేశారు. ఈ ఘటనలో భార్య వర్ధీకాసులతో పాటు సమీప బంధువైన రాజ్‌కుమార్‌కు గాయాలయ్యాయి. గాయపడిన ఇరువురిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

6న పతంజలి శాస్త్రి అభినందన సభ

విజయవాడ కల్చరల్: కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత తల్లావఝుల పతంజలి శాస్త్రి అభినందన సభను 6 వ తేదీ సాహితీ మిత్రులు ఆధ్వర్యంలో నిర్వహిస్తునట్లు కవి రచయిత బండ్ల మాధవరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బందరురోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో నిర్వహించే కార్యక్రమంలో సాహితీవేత్తలు రమణమూర్తి, బాలాంత్రపు ప్రసూనా, పాపినేని శివశంకర్, చినుకుమాస పత్రిక సంపాదకుడు నండూరి రాజగోపాల్ పాల్గొంటారని పేర్కొన్నారు.

కండెక్టర్‌కు ఆర్థిక సాయం

ఇబ్రహీంపట్నం: క్యాన్సర్‌కు గురై చికిత్స పొందుతున్న మహిళా కండక్టర్ యోగేశ్వరిని ఎన్ఎంయూఏ రాష్ట్ర అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు డిపో నాయకులతో కలిసి గురువారం పరామర్శించారు. డిపోలో యూనియన్ సభ్యులు, ఉద్యోగులు, మహిళా కండక్టర్లు సమకూర్చిన రూ.1.15 లక్షలను ఆమెకు అందజేశారు. రాష్ట్ర కోశాధికారి మోహన్, సీసీఎస్ బోర్డు డైరెక్టర్ ఎస్.అనంతరాములు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, కార్యదర్శి రామకృష్ణ, బ్రాంచి నాయకులు పాల్గొన్నారు.

వేంకటాచలస్వామికి సహస్ర దీపాలంకరణ



తిరువూరు: ఫాల్గుణ మాసంలో శ్రవణ నక్షత్ర సందర్భంగా స్థానిక వేంకటాచలస్వామి ఆలయంలో గురువారం రాత్రి సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు దేవయాజనం వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి విశేషార్చనలు నిర్వహించిన అనంతరం భక్తబృందం సభ్యుడు నాగుబండి విశ్వేశ్వరరావు దంపతులు సహస్ర దీపాలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మందిరంలో పారాయణం

మధురానగర్(విజయవాడసెంట్రల్):పసుపుతోట దత్తసాయి మందిరంలో గురువారం సాయినక్షత్ర మాలిక మండలి ఆధ్వర్యాన సాయినామ పారాయణం జరిగింది. మందిర వ్యవస్థాపకులు తంగెళ్ళమూడి వీరమోహనరావు బాబాకు విశేషంగా పంచామృత అభిషేకం, ప్రత్యేక పూజలు అర్చనలు నిర్వహించారు.

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి



ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకోవాలని గవర్నర్‌పేట సీఐ డీవీ వెంకటరమణ సూచించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీస్ కమిషనర్ టీకే రాణా ఆదేశాల మేరకు ఈస్ట్ జోన్ డీసీపీ అధిరాజ్ రాజ్ సింగ్ పర్యవేక్షణలో సౌత్ జోన్ ఏసీపీ రత్న రాజు ఆధ్వర్యంలో గురువారం గవర్నర్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలోని హనుమాన్‌పేటలో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఎన్నికల్లో ప్రజలు పాటించాల్సిన విధి విధానాలు గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా పోలీసులు అన్ని రకాల చర్యలను తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరుగుతాయని ప్రజలకు భరోసా కల్పించారు. ఎన్నికల నియమ నిబంధనలను రాజకీయ పార్టీలు తప్పక పాటించాలని సూచించారు. ఓటర్లను ఆటంక పరచడం, ఫలానా పార్టీకి ఓటు వేయాలని ప్రలోభ పెట్టడం, బెదిరించడం వంటి వాటికి పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శాంతికి భంగం కలిగించడం, దొంగ ఓట్లు వేయడం వంటివి చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

'మణిపాల్'లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సేవలు ప్రారంభం



మాట్లాడుతున్న డాక్టర్ సుధాకర్

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణం మహానాడులో ఉన్న మణిపాల్ హాస్పిటల్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా హాస్పిటల్‌లో బుధవారం డాక్టర్ కంటిపూడి సుధాకర్ విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులు, వయోవృద్ధుల్లో న్యూమోకాకల్, ఇన్‌ఫ్లూయెంజ వంటి శ్వాసకోస ఇన్ఫెక్షన్ల నివారణకు ముందస్తుగా టీకాలు వేయడం, వారి క్రమబద్ధమైన ఆరోగ్య పరిరక్షణకు ఈ సెంటర్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. మణిపాల్ హాస్పిటల్ విజయవాడ ఫైజర్‌తో భాగస్వామ్య కుదుర్చుకున్నట్లు వెల్లడించారు. హాస్పిటల్‌లో వయోవృద్ధులకు వ్యాక్సినేషన్ కోసం ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. రోగి ఆరోగ్య సంరక్షణ, టీకాలపై అవగాహన, నివారించగల వ్యాధుల కోసం హాస్పిటల్‌లో సమగ్ర ఆరోగ్య సంరక్షణ పర్యావరణ వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇందుకు సంబంధించి ఇంటర్వెన్షనల్ పల్మోనాలజీ డాక్టర్ లోకేష్ గుత్తాతో జరిగిన ప్యానెల్ చర్చలో నిపుణుల సూచనలతో పాటు, చర్చకు నాయకత్వం వహించిన ఇంటర్నల్ మెడిసిన్ కన్సల్టెంట్ డాక్టర్ మనోజ్‌కుమార్, సీనియర్ డాక్టర్లతో సైంటిఫిక్ సమ్మిట్ నిర్వహించినట్లు తెలిపారు. ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ డాక్టర్ ఎన్. మురళీకృష్ణ, మెడికల్ ఆంకాలజీలో డాక్టర్ కృష్ణారెడ్డి, నెఫ్రాలజీ డాక్టర్ వీఎస్ఎస్ఎన్ శ్రీధర్, జనరల్ మెడిసిన్ డాక్టర్ యు.హారిక సమష్టి దృష్టిసారించారన్నారు. రిస్క్ గ్రూపులకు ప్రాధాన్యం ఇవ్వడంపై చర్చించామన్నారు.

ఫండింగ్ ఆపర్చునిటీస్‌ను సద్వినియోగం చేసుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న రాధా ప్రసాదరాజు

మైలవరం: ఫండింగ్ ఆపర్చునిటీస్ ఫర్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ అవకాశాన్ని అధ్యాపకులు సద్వినియోగం చేసుకోవాలని ఫార్మర్ సైంటిస్టు డాక్టర్ డి. రాధా ప్రసాదరాజు అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్, సీఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో ఫండింగ్ ఆపర్చునిటీస్ ఫర్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ అంశంపై కళాశాల అధ్యాపకులకు గురువారం అవగాహన సదస్సు జరిగింది. రాధా ప్రసాదరాజు మాట్లాడుతూ రీసెర్చ్ ఫండింగ్ ప్రాజెక్టుల్లో ప్రభుత్వ ఏజెన్సీల గురించి, అవి ఏయే సమయాల్లో విడుదల అవుతాయి, రీసెర్చ్ ఫండింగ్ ప్రాజెక్ట్ ప్రపోజల్స్, పేటెంట్స్ పేపర్స్ ఎలా అప్‌లై చేయాలో విపులంగా వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు మాట్లాడారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రమేష్‌రెడ్డి, ఆర్ అండ్ డీ డీన్ డాక్టర్ ఎస్. పిచ్చిరెడ్డి, సీఎస్ఈ (ఏఐ అండ్ ఎంఎల్) విభాగాధిపతి డాక్టర్ ఎస్. జయప్రద, డీన్స్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సైన్స్ అండ్ టెక్నాలజీపై జాతీయ సదస్సు



కేతనకొండ(ఇబ్రహీంపట్నం): ఇంజినీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో అడ్వాన్స్ ట్రెండ్స్‌పై కేతనకొండ ఆర్కే ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ స్థాయి సదస్సు జరిగింది. క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ కో–ఆర్డినేటర్ హరీష్, ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య గురువారం సదస్సును ప్రారంభించారు. ఇంజినీరింగ్ సాంకేతికతలో నూతన ఒరవడిని చేర్చేందుకు దేశంలోని వివిధ శాస్త్రవేత్తలు, పండితులు, పరిశోధకులను ఒకే చోటుకు చేర్చడమే సదస్సు ముఖ్య ఉద్దేశ్యమని వారు చెప్పారు. సబ్జెక్టులో సాంకేతిక విజ్ఞానం పెంచుకోవడంపై అవగాహన కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 350 మంది వారి పరిశోధనలను ప్రజెంట్ చేశారు. న్యాయనిర్ణేతలు ఉత్తమ ఆవిష్కరణలను ఎంపికచేశారు. ప్రిన్సిపాల్ కె.రామకృష్ణయ్య, వైస్ ప్రిన్సిపాల్ సాయిరామ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పానీపూరి వ్యాపారిపై యువకుడి దాడి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):పానీపూరి వ్యాపారిపై ఓ యువకుడు దాడిచేసిన ఘటన అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సింగ్‌నగర్ పీఅండ్‌టీ కాలనీకి చెందిన బాలకుమార్ అనే వ్యక్తి పానీపూరి వ్యాపారం చేస్తుంటాడు. వాంబేకాలనీకి చెందిన వర్ధన్ అనే యువకుడు పానీపూరి కోసం ప్రతిరోజూ ఆ బండి దగ్గరకు వస్తుంటాడు. బుధవారం రాత్రి కూడా పానీపూరి కోసం రాగా పానీపూరి అయిపోయిందని బాలకుమార్ బదులిచ్చాడు. సరే ఒక ప్లాస్టిక్ కవర్ ఇవ్వమని అడగ్గా కవర్ ఇచ్చి ముందుకు వెళ్తుండగా వర్ధన్ ఒక్కసారిగా బాలకుమార్‌ను అడ్డుకొని నాకే పానీపూరి లేదని చెబుతావా అంటూ దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో బాలకుమార్ మొహం మీద గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

భక్తులకు మజ్జిగ పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు షిరిడీ సాయిబాబా మందిరంలో ఆధ్యాత్మిక, సేవలను రెండు కళ్లుగా చేసుకొని పనిచేస్తున్నామని మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి అన్నారు. వేసవి ఎండలు దృష్ట్యా మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గౌతంరెడ్డి మాట్లాడుతూ ఏటా మందిరానికి విచ్చేస్తున్న భక్తులందరికీ వడ దెబ్బ తగలకుండా ఆరోగ్య రక్షణ కోసం చల్లటి మజ్జిగ పంపిణీ చేస్తున్నామని తెలిపారు.